క్లుప్తంగా

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి



విచారణ చేస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ ప్రజాప్రతినిధులు

పాణ్యం: విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉండాలని ఎంపీపీ ఉసేన్‌బీ సూచించారు. ఈ నెల 8వ తేదీన పాణ్యం చెంచుకాలనీలోని పాఠశాలలో విద్యార్థి భవనం పైనుంచి కిందకు దూకిన ఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థి దూకడానికి గల కారణాలు, అసలు ఎందుకు పైకి వెళ్లిందని ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు పోటీ పడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఏమైనా సమస్యలొస్తే పాఠశాల సిబ్బంది లేదా తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కో–ఆప్షన్ సభ్యుడు జాకీర్‌ఉసేన్, బాబు, కరుణాకర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు ఆదివారం బంద్

గడివేముల: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ప్రతి ఆదివారం సెలవు పాటిస్తున్నట్లు మండల ఎరువుల దుకాణాల అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామంలో దుకాణదారుల సమావేశం నిర్వహించారు. ఆదివారం ఫర్టిలైజర్ దుకాణాల సెలవు విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలని కోరారు. సభ్యులు పుల్లారెడ్డి, శ్రీనివాసులు, జమాల్‌బాషా, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి సహకరించాలి



గడివేముల మూల పెద్దమ్మ ఆలయంలో దాతలు వేసిన బోరు వద్ద చైర్మన్, ధర్మకర్తలు

గడివేముల: మండల కేంద్రంలో భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతున్న శ్రీ మూల పెద్దమ్మ ఆలయ ఆవరణలో దాతల సహకారంతో నీటి బోరును ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ తలారి చిన్నన్న తెలిపారు. కొత్తపల్లె మండలం దుద్యాల గ్రామానికి చెందిన శకుంతలమ్మ జ్ఞాపకార్థం భర్త కొల్లూరు కృష్ణమూర్తి, కుమారులు వేణుగోపాల్ శెట్టి, శ్రీనివాసగుప్త బోరు, మోటార్‌ను అందజేశారు. దాతలు వేసిన బోరులో పుష్కలంగా నీరు పడినట్లు ఆలయ ఈఓ మోహన్ చెప్పారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి భక్తులు ముందుకు రావాలని కోరారు. ప్రధాన అర్చకులు సామన్న, ధర్మకర్తలు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కర్నూలు (న్యూటౌన్): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఆర్.శివరాముడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని తహసీల్దార్ శేషఫణి ఆదేశించారు. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): నగరంలోని 32 వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు సుధాకరప్ప కోరారు. శుక్రవారం నగరంలోని 32వ వార్డులో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సుధాకరప్ప మాట్లాడుతూ.. 2017లో రైతు బజార్‌కు శంకుస్థాపన చేసి నేటికి నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. మురుగు కాలువలు నిర్మించి దుర్వాసన నుంచి విముక్తి కలిగించాలన్నారు. సామూహిక మరుగుదొడ్డి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఆ స్థానంలో కొత్తది నిర్మించాలన్నారు. వివిధ కారణాలరీత్యా తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలని కోరారు. సీపీఎం నాయకులు విజయ్‌కుమార్, రామాంజనేయులు, మధు, శ్రావణ్, ఆనంద్, దావీద్, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాతో రైతన్న ధీమా

- వైఎస్సార్ పంటల బీమా ద్వారా రూ.2.20 కోట్ల పరిహారం మంజూరు
- మండలంలో 1,443 మంది రైతులకు లబ్ధి

ఓర్వకల్లు: రైతులు సాగు చేసిన పంటలకు ఉచితంగా పంటల బీమా సౌలభ్యం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సంభవించే అతివృష్టి, అనావృష్టి వల్ల దెబ్బతిన్న పంటలకు బీమా సొమ్ము చెల్లించి రైతులకు ఆర్థిక చేయూతనందించింది. ఈ పథకం ద్వారా మండలంలో 2,188 ఎకరాలకు పంట నష్ట పరిహారం మంజూరైంది. తద్వారా దాదాపు 1,450 మంది రైతులకు లబ్ధి చేకూరింది. వ్యవసాయాధికారులు తెలిపిన గణాంకాల ప్రకారం 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ఉల్లి, వేరుశనగ, జొన్న పంటలకు బీమా పరిహారం మంజూరైంది. రైతులు ఒక్క పైసా చెల్లించకుండానే ప్రభుత్వం బీమా సొమ్మును మంజూరు చేయడంపై రైతుల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు రకాల పరిహారం మంజూరు

ప్రభుత్వం దిగుబడి ఆధారిత బీమా కింద పంట కోత ప్రయోగాలను బట్టి పరిహారం చెల్లిస్తోంది. ఈ విధానంలో మండలంలోని 183 ఎకరాలకు రూ.15,87,691 మంజూరైనట్లు అధికారులు తెలిపారు. తద్వారా 106 మంది రైతులకు లబ్ధి చేకూరింది. వాతావరణ ఆధారిత బీమా కింద 2,005 ఎకరాలకు రూ.2,05,07,488 మంజూరు కాగా, 1,337 మంది రైతులకు ప్రయోజనం కలిగింది. మొత్తం 2,188 ఎకరాలకు రూ.2,20,95,179 మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు.

ఆర్‌బీకేల వారీగా మంజూరైన పరిహారం

వాతావరణ ఆధారిత బీమా కింద కొమరోలు ఆర్‌బీకే పరిధిలో 65.86 ఎకరాలలో నష్టపోయిన 37 మంది రైతులకు రూ.6,63,318 నగదు మంజూరై మొదటి స్థానంలో నిలవగా, శకునాల ఆర్‌బీకే పరిధిలో 67 ఎకరాలలో నష్టపోయిన 35 మందికి రూ.6,93,913 పరిహారం మంజూరుతో రెండవ స్థానంలో నిలిచింది. లొద్దిపల్లె ఆర్‌బీకే పరిధిలో 22.52 ఎకరాలలో నష్టపోయిన 17 మంది రైతులకు రూ.1,03,918 మంజూరుకాగా మూడో స్థానం, నన్నూరు–2 ఆర్‌బీకే పరిధిలో 16 ఎకరాలలో పంట నష్టపోయిన పది మంది రైతులకు రూ.74,235 మంజూరుతో నాల్గో స్థానంలో నిలిచింది.

దిగుబడి ఆధారిత బీమా కింద పూడిచెర్ల ఆర్‌బీకే పరిధిలో 431 ఎకరాలలో నష్టపోయిన 301 మంది రైతులకు రూ.44,17,540 పరిహారం మంజూరుకాగా తొలి స్థానంలో నిలిచింది. కన్నమడకల ఆర్‌బీకే పరిధిలో 444 ఎకరాలలో నష్టపోయిన 253 మంది రైతులకు రూ.45,56,158 మంజూరుతో రెండో స్థానం, లొద్దిపల్లె ఆర్బీకే పరిధిలో 202 ఎకరాలలో నష్టపోయిన 166 మంది రైతులకు రూ.20,71,691 మంజూరు కావడంతో మూడో స్థానం, నన్నూరు–2 ఆర్బీకే పరిధిలో 171 ఎకరాలలో నష్టపోయిన 123 మంది రైతులకు రూ.17,60,292 మంజూరుతో నాల్గో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాలలో నన్నూరు–3 ఆర్బీకే పరిధిలో 158 ఎకరాలలో నష్టపోయిన 99 మంది రైతులకు రూ.16,19,799 మంజూరుకాగా, ఉప్పలపాడు ఆర్బీకే పరిధిలో 128.77 ఎకరాలలో నష్టపోయిన 95 మంది రైతులకు రూ.13,17,642 మంజూరు కావడంతో ఐదు, ఆరు స్థానాలలో నిలిచాయి. మిగతా రైతు భరోసా కేంద్రాల పరిధిలో వివిధ స్థాయిలో బీమా పరిహారం మంజూరైంది.



ఉల్లి పంటను నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

బీమా సొమ్ము రావడం సంతోషం



ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత బీమా కింద పరిహారం చెల్లించడం సంతోషంగా ఉంది. మా అత్త తనకు ఉన్న రెండు ఎకరాలలో జొన్న పంటను సాగుచేసింది. ఆ సమయంలో అధిక వర్షాల వల్ల పంట కుళ్లిపోవడంతో దున్నేసింది. తర్వాత ఆమె అనారోగ్యంతో మరణించింది. ప్రస్తుతం ఆమె పేరిట రూ.15,527 పరిహారం వచ్చింది.

– మహబూబ్‌బాష, జొన్న రైతు, ఉయ్యాలవాడ

ఉచిత బీమాతో రైతులకు చేయూత



రైతులు సాగు చేసిన పంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉచితంగా బీమా సౌకర్యం కల్పించి వారికి ఆర్థిక చేయూతనిస్తున్నారు. ఒక్క రూపాయి ప్రీమియం కట్టించుకోకుండా పరిహారం చెల్లించడం గొప్పవిషయమే. నేను గతేడాది ఖరీఫ్‌లో వర్షాధారం కింద 6 ఎకరాలలో ఉల్లి పంట సాగు చేశాను. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంటను ఎత్తి పోశాను. వ్యవసాయాధికారులు చేసిన పంట నమోదు ఆధారంగా నాకు రూ.62,795 పరిహారం మంజూరైనట్లు అధికారులు తెలిపారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం వైఎస్ జగన్.

– పద్మనాభరెడ్డి, ఉల్లి రైతు, మీదివేముల

ప్రభుత్వం ఆదుకుంది



నాకున్న ఐదెకరాల్లో ఉల్లి పంట సాగు చేసి వాతావరణం అనుకూలించక దిగుబడి రాక రూ.2 లక్షలకు పైగా నష్టపోయా. ఈ ఏడాది పంటల సాగుకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అందించిన బీమా వల్ల కొంత మేర ఊరట లభించింది. మాలాగా పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు బీమాతో ఆర్థికంగా భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– భాస్కర్‌రెడ్డి, ఉల్లి రైతు, వెంకటగిరి

కోడుమూరు నియోజకవర్గానికి రూ.25.85 కోట్లు మంజూరు

కోడుమూరు రూరల్: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతుల పట్ల ప్రకృతి చిన్న చూపు చూసినా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ ఉచిత పంటల బీమా ఎంతో ధీమాను ఇచ్చింది. 2022 ఖరీఫ్‌లో ఉల్లి, పత్తి, వేరుశనగ, జొన్న పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ ఉచిత పంటల బీమా సొమ్మును శనివారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నేరుగా జమచేయడంతో రైతన్నల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రకృతి తమపై కన్నెర్రజేసినా రాష్ట్ర ప్రభుత్వం చల్లని చూపు చూసిందంటూ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయిన ఉల్లి రైతులకు బీమా మంజూరుతో ఊరట లభించింది. బీమా కింద నియోజవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు రూరల్ గ్రామాలకు సంబంధించి 30,535 మంది రైతులకు రూ.25,85,34,686 మేర లబ్ధి చేకూరింది.

వాతావరణ, దిగుబడి ఆధారిత బీమా

వర్షాధారమైన పత్తి, వేరుశనగ పంటలకు వాతావరణ ఆధారిత, బోర్ల కింద సాగు చేసిన పత్తి, ఉల్లికి దిగుబడి ఆధారిత పంటల బీమాకు నోటిఫై చేశారు. ఉల్లి పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10,244, పత్తి సాగుచేసిన రైతుకు రూ.1360, జొన్న పంట సాగు చేసి నష్టపోయిన వారికి ఎకరానికి రూ.7760 , వేరుశనగ ఎకరానికి రూ.2124 చొప్పున నష్ట పరిహారం లెక్కించారు.

రైతు వాటాను భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పండించిన పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి ఉండేది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వాతావరణ, దిగుబడి ఆధారిత పంటల బీమాలో కేంద్రం వాటాతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 5 శాతం ఉంటుంది. ఈ 5 శాతంలో రైతు 2 శాతం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 1.5 శాతం చెల్లించాల్సి ఉంది. అయితే రైతులకు భారం పడకూడదనే ఉద్దేశంతో ఆ మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతుకు పంటల బీమా వర్తించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పైసా ఖర్చు లేకుండా ధ్రువపత్రాలు

కల్లూరు: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు టైపిస్ట్ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు అందించడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు కావలసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజ్ సర్టిఫికెట్ తదితర 11 రకాల సేవలను దరఖాస్తు చేసుకున్న వెంటనే అందిస్తున్నామన్నారు. ప్రజలు వారి సచివాలయాల వద్ద నిర్వహిస్తున్న క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, శివరాం స్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

చురుగ్గా భవన నిర్మాణాలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో ప్రభుత్వం చేపట్టిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. స్థానిక ప్రభుత్వ భూమిలో రూ.35 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం, రూ. 21.80 లక్షల నిధులతో రైతు భరోసా కేంద్రం నిర్మాణాలను పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ చేపట్టారు. అధికారుల చొరవ కారణంగా ఆయా భవన నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో అధికారులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. త్వరలోనే కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే సచివాలయం సమీపంలోనే చేపట్టిన రైతు భరోసా కేంద్రం భవనం పనులు కూడా 70 శాతం మేరకు పూర్తయ్యాయి. ఆర్‌బీకే భవన పైకప్పు పనులు పూర్తి కాగా మిగతా పనులను పూర్తి చేయించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.



నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయ భవనం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

కల్లూరు: పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కె.మార్కాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ గ్రామంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన వారికి నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యం

జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కె.మార్కాపురంలో గ్రామ సచివాలయ భవనంతో పాటు బీటీ రోడ్డు, సీసీ రోడ్డులను ఎమ్మెల్యే కాటసాని, ఎంపీపీ బోయ శారద ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి స్థానికంగానే అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గ్రామంలో సుమారు 1.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. కోడుమూరు రోడ్డు నుంచి వయా కె.మార్కాపురం నుంచి పెద్దకొట్టాల వరకు కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మించామన్నారు. భక్తుల సౌకర్యార్థం కె.నాగలాపురం రోడ్డు నుంచి ఎల్లమ్మ గుడి వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, గ్రామ ప్రజల సౌకర్యార్థం కె.మార్కాపురం నుంచి పర్ల వెళ్లే రోడ్డును రూ.10 లక్షలతో నిర్మించామన్నారు. సర్పంచ్ గణ మద్దిలేటి, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నిత్యావసర సరుకుల అందజేత

స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీ, బీటీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఏర్పడి సామగ్రి మొత్తం కాలిపోగా కుటుంబసభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులు, చీరలు, కొంత నగదు అందజేశారు. ఘటనను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన సహాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

గడివేముల: పార్టీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటానని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వెల్లడించారు. గడివేముల ఉప సర్పంచ్ తలారి బాలచెన్ని మాతృమూర్తి వెంకటలక్ష్మమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం గడివేములకు వచ్చి ఆ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఉపసర్పంచ్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటానని భరోసానిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, దేశం నాగేశ్వరరెడ్డి, చిన్నన్న తదితరులు వెంట ఉన్నారు.

అన్నదాత.. కాస్త జాగ్రత్త

- వర్షకాలం విద్యుత్ పెట్టెల వద్ద అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికే ముప్పు
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు అడ్డుకట్ట
- గతేడాది విద్యుత్ ప్రమాదాల్లో మృతుల సంఖ్య – 52
- ఈ ఏడాది మృతి చెందిన వారు – 11



గని గ్రామంలో విద్యుదాఘాతానికి గురై మరణించిన గేదె (ఫైల్)

గడివేముల: ఆరుగాలం కష్టపడి పంటలను సాగు చేసే రైతులు పంటలకు నీరు పెట్టడానికి వెళ్తూ పొరపాటున విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నారు. మరికొందరు స్వయంగా మరమ్మతులు చేస్తూ ప్రమాదాల బారి పడుతున్నారు.అలాగే పొలాల్లో తెగిపడిన తీగలు, కిందకు వేలాడే తీగల వల్ల ప్రమాదాలు జరిగాయి. ఏదేమైనా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఇళ్ల వద్ద, పంట పొలాల్లో విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో విద్యుత్, బోరుబావులు, వాగుల వద్ద మోటార్లు ఏర్పాటు చేసి పంటలు సాగు చేస్తుంటారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో వానలతో పాటూ ఈదురుగాలులు ఎక్కువగా వీచే అవకాశాలు ఉండటంతో జీవాలను మేత కోసం తోలుకెళ్లే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. గతేడాది వ్యవసాయ విద్యుత్ ప్రమాదాల కారణంగా 52 మంది మృత్యువాత పడగా, ఈ ఏడాది ఇప్పటివరకు 11 మంది మృతి చెందారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు అప్రమత్తతో పాటు అవగాహన, అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే మంచిదని నంద్యాల విద్యుత్ శాఖ ఈఈ రమణారెడ్డి రైతులకు తెలియజేస్తున్నారు.

మూడు రకాల ప్రమాదాలకే పరిహారం

విద్యుత్ సంస్థలు కేవలం మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తాయి. మనుషులు, పశువులు మరణిస్తే సాయం అందుతుంది. గాయాలకు పరిహారం ఉండదు. మనుషులకు అయితే రూ.5 లక్షలు, పశువులకైతే రూ.40 వేలు, మేకలు, గొర్రెలకు రూ.7 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తారు. ప్రమాదం జరిగిన స్థలంలోని చిత్రం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు. శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకైతే ఫొటోతో పాటు పశు వైద్యుడి పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందించాల్సి ఉంటుంది.

నష్ట పరిహారం ఇలా..

- అకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగి కింద పడి ప్రాణ నష్టం జరిగితే నష్ట పరిహారం ఇస్తారు.
- ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడం, విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్న కారణంగా ప్రాణనష్టం జరిగితే పరిహారం అందుతుంది

ప్రమాదాలు ఇలా..

వర్షాకాలంలో ఈదురు గాలులతో విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు విరిగిపోయి కరెంటు సరఫరా అవుతుండడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లినప్పుడు అక్కడ సరైన వైరింగ్ లేకపోవడం, ఏమరుపాటు వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. డిస్ట్రిబ్యూషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమతి లేకుండా ఫ్యూజులు మార్చే సందర్భంలో కరెంటు సరఫరా కావడంతో పలువురు చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. సర్వీస్ వైర్లు, వీధి దీపాలను సరిచేసేందుకు విద్యుత్ స్తంభాలు ఎక్కినప్పుడు కరెంటు సరఫరా జరిగి మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి.

ప్రాంతం	విద్యుత్ ప్రమాదాలు (గతేడాది)	ప్రస్తుతం
నంద్యాల	11	1
నంద్యాల రూరల్‌లో	24	6
ఆళ్లగడ్డ	22	1
కోవెలకుంట్ల	5	3



పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ పెట్టె

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- విద్యుత్ పనులు సొంతంగా చేసుకోరాదు.
- తడి చేతితో విద్యుత్ పరికరాలు ముట్టుకోరాదు.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతే కరెంటు ఉండదని మరమ్మతులు చేయకూడదు.
- మోటార్లను నేలపై కాకుండా గద్దెలపై ఏర్పాటు చేయాలి. స్టార్టర్ బోర్డు తడవకుండా చూడాలి.
- మోటారు పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతులు చేయించాలి. సొంతంగా ప్రయత్నించవద్దు.
- స్టార్టర్ వైర్లు నేల మీద ఉంచకూడదు. స్టార్టర్‌పై మూత తీసి వాడకూడదు.
- సర్వీసు వైర్లు, మోటార్లకు వాడే తీగలు నాణ్యమైనవి ఉండాలి. అతుకులు లేకుండా చూసుకోవాలి.
- సబ్ మెర్సిబుల్ మోటారుతో పాటు విద్యుత్ వైర్ ఉంటుంది. ఏ కొంచం వైర్లు తెగి ఉన్నా, మోటార్ నుంచి పైన ఉండే వస్తువులకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది.
- ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి పొడవైన ప్లాస్టిక్ పైపు, కర్రతో వ్యక్తిని తప్పించాలి. తగిన వైద్య సహాయం అందించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యుత్ ప్రమాదాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలి. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాల బారిన పడకుండా విద్యుత్ శాఖ అధికారులు సూచించిన జాగ్రత్తలు పాటించాలి. ఎక్కడైనా తీగలు తెగిపడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. అన్నదాతలు సర్టిఫైడ్ ఎలక్ట్రీషియన్లతోనే విద్యుత్ పనులు చేయించుకోవాలి. స్విచ్‌లు వేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

– రమణ రెడ్డి, విద్యుత్ శాఖ ఈఈ, నంద్యాల

ట్రాలీ ఆటోను ఢీకొన్న టిప్పర్



పాణ్యం: మండల పరిధిలోని ఆర్‌జీఎం కళాశాల వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఆదివారం తెలిపారు. వివరాలు.. డోన్ పట్టణానికి చెందిన ఓబులేసు ఇంటి సామాన్ల లోడ్‌తో నంద్యాలకు బయలుదేరారు. ఆర్‌జీఎం కళాశాల వద్ద గేదెలు రోడ్డు దాటుతుండగా మరో టిప్పర్ వెనుక వాహనాన్ని వరుసలో ఉంచారు. ఇంతలో వెనుక వచ్చిన మరో టిప్పర్ ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఓబులేసుకు గాయాలు కావడంతో నంద్యాలకు తరలించారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. రెండు వాహనాలను పక్కకు తొలగించారు.

ఫీజుల దోపిడీ నియంత్రించాలి

కర్నూలు(సెంట్రల్): కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. ఆదివారం తమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫీజుల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 53, 54 జీఓలను విడుదల చేసిందన్నారు. అయితే వాటిని అమలు చేయడంలో విద్యాశాఖాధికారులు విఫలమయ్యారని విమర్శించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 25 శాతం సీట్లను కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు అమలు చేయడంలేదని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో శేషమ్మ, కర్రెమ్మ, భాగ్యమ్మ, శంకరమ్మ,ఆంజనేయులు, నాగరాజు, పీటర్ పాల్గొన్నారు.